# నమస్తే తెలంగాణ

## ఆదిలాబాద్ - నిర్మల్

5 | నిజామాబాద్ మంగళవారం 14 జనవరి 2025 | ADILABAD NIRMAL




రుణమాఫీ కాలేదని చెబుతున్న పద్దనపల్లి రైతులు

### సంక్రాంతి పోతున్నా మాఫీ లేదు



పద్దనపల్లి సొసైటీలో నేను, మా అన్న తలా రూ.30 వేల చొప్పున లోన్ తీసుకున్నం. వడ్డీ కలిపితే మొత్తం రూ.40 వేల లోపే ఉంటది. మా ఇద్దరి రేషన్‌కార్డులు కూడా వేర్వేరుగా ఉన్నాయి. కానీ మాకు రుణమాఫీ కాలేదు. కేసీఆర్ సర్కారులో మాఫీ అయినయి. ఇప్పుడు ఎందుకు కాలేదో తెలియడం లేదు. అధికారులను అడిగితే అప్పుడైతది.. ఇప్పుడైతదని చెప్పుకొచ్చిన్రు. చివరకు జనవరిలో అవుతుందన్నారు. జనవరి వచ్చి సంక్రాంతి పండుగ పోతున్నా ఇప్పటికీ కాకపాయె. మాకు న్యాయం చేయాలి.

- గొల్ల భూమేశ్, రైతు పద్దనపల్లి

### సొసైటీలో ఎవ్వరికీ కాలేదు



మా నాన్న పేరుపై పద్దనపల్లి సొసైటీలో రూ.లక్ష లోన్ ఉన్నది. నా పేరుతో వేరే బ్యాంక్‌లో రూ. లక్ష దాకా ఉన్నది. ఇద్దరి రేషన్‌కార్డు ఒక్కటే. లెక్క ప్రకారం ఇద్దరిలో ఒక్కరికన్నా కావాలి. కానీ, ఇద్దరిలో ఏ ఒక్కరికీ మాఫీ కాలేదు. ఆన్‌లైన్‌లో ఏదో ఆడిట్ చేయాల్సి ఉందని చూపిస్తున్నది. మా పద్దనపల్లి సొసైటీ పరిధిలోని హాజీపూర్, దొనబండ, టీకానపల్లి, బలవార్‌పేట, పెద్దంపేట, పద్దనపల్లి గ్రామాల రైతులందరూ ఉన్నారు. దాదాపు రెండు వేల మంది రైతులుంటే కేవలం ఒక్కరికే రుణమాఫీ అయ్యింది. మా సొసైటీలో ఇట్లా ఎందుకైందో అర్థమైతలేదు.

- కొత్తకొండ నాగరాజు



చెన్నూర్‌లోని ప్రాథమిక సహకార సంఘం

*చెన్నూర్ పీఏసీఎస్ సొసైటీలో 635 మంది రైతులుంటే రూ.2 లక్షల లోపు రుణం తీసుకున్నవాళ్లు 626 మంది. వీరిలో రుణమాఫీ అయినోళ్లు కేవలం 197 మందే. రూ. 2 లక్షల లోపు రుణాలు రూ.4.64 కోట్లు ఉండగా, కేవలం రూ.కోటి మాత్రమే మాఫీ అయ్యింది.*

### ఆడిట్ చేస్తున్నాం.. పండుగయ్యాక మాఫీ అవుతుంది

ఆన్‌లైన్‌లో ఆడిట్ సమస్య ఉందని చూపిస్తున్న రైతులందరికీ పండుగయ్యాక మాఫీ డబ్బులు ఖాతాల్లో పడుతాయి. పద్దనపల్లిలో మొన్ననే మా ఇద్దరు అధికారులు వెళ్లి ఆడిట్ చేసి వచ్చారు. మిగిలిన సొసైటీల్లో ఆడిట్ చేస్తున్నారు. రైతులెవరూ కంగారు పడాల్సిన పని లేదు. రూ. 2 లక్షల లోపు రుణం ఉండి, అర్హులైన వారందరికీ మాఫీ అవుతుంది. సొసైటీల్లో వాటాధనం కట్టని వారి నుంచి కొంత మొత్తం కట్ చేసుకుంటారు. తిరిగి చెల్లించేటప్పుడు అది కట్ చేసే చెల్లించుకుంటారు. కొందరు రైతులు దీనిపై అవగాహన పెంచుకోవాలి. నిజంగా అలాంటివి ఎక్కడైనా ఉంటే మాకు చెప్పండి. కచ్చితంగా చర్యలు తీసుకుంటాం.

- సంజీవ్‌రెడ్డి, డీసీవో, మంచిర్యాల

# సహకార సంఘాల్లో రుణమాఫీ కాలే..

## 1972 మంది రైతులున్న పద్దనపల్లి సొసైటీలో ఒక్కరికే..

- ఉమ్మడి జిల్లాలో 56 వేల మంది ఉండగా, 25 వేల మందికే మాఫీ
- సొసైటీల్లో రుణం తీసుకున్న రైతుల్లో 36 శాతం మందికే..
- ఆన్‌లైన్‌లో 'ఆడిట్ చేయలేదు' అని చూపిస్తున్న వైనం
- సొసైటీల్లో అక్రమాలపై విచారణ చేయాలంటున్న అన్నదాతలు
- పండుగయ్యాక మాఫీ అవుతుందంటున్న అధికారులు

మంచిర్యాల, జనవరి 13 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : .. ఇలా పద్దనపల్లి, చెన్నూర్ పీఏసీఎస్ సొసైటీలోనే కాదు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అన్ని సహకార సంఘాల్లోనూ దాదాపు ఇదే పరిస్థితి ఉంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మొత్తం సహకార సంఘాల్లో రూ. 2 లక్షల లోపు రుణాలు తీసుకున్న రైతులు 56 వేల మంది ఉన్నారు. వీరంతా రూ.498 కోట్ల రుణం తీసుకోగా, ఈ మొత్తం మాఫీ చేయాలని అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. కానీ, కాంగ్రెస్ సర్కారు అన్ని విడుతల్లో కలిపి 26 వేల మంది రైతులకు రూ.185 కోట్లు మాత్రమే రుణమాఫీ చేసింది. మరో 30 వేల మంది రైతులకు రూ.313 కోట్ల మాఫీ కాలేదు. మొత్తంగా చూసుకుంటే సహకార సంఘాల్లో రుణమాఫీ జరిగిన రైతులు 36 శాతం మాత్రమే ఉన్నారు. ఇది ఒక ఆదిలాబాద్ జిల్లాలోనే కాదు దాదాపు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని సహకార సంఘాల్లోనూ ఇలాంటి పరిస్థితి ఉందని తెలుస్తున్నది. రూ. 2 లక్షల లోపు రుణం ఉన్న రైతులందరికీ మాఫీ చేశామంటూ గొప్పలు చెప్పుకుంటున్న.. అధికార పార్టీ నాయకులు సహకార సంఘాల్లో రుణమాఫీ కాని రైతుల విషయం బయటికి పొక్కకుండా తొక్కిపెడుతున్నారనే ఆరోపణలున్నాయి.

### రూ. కోట్లలో అవినీతి..!

సహకార సంఘాల్లో రుణాల మాటున కోట్లాది రూపాయల అవినీతి జరిగిందని రైతులు ఆరోపిస్తున్నారు. బ్యాంక్‌లో రూ. 2 లక్షల లోన్ తీసుకుంటే దానిపై వడ్డీ ఎంతైతే అంత కలిపి తిరిగి చెల్లించాలి. కానీ, సహకార సంఘాల్లో షేర్ అమౌంట్ ముందే కట్ చేసుకుంటారు. ఉదాహరణకు ఒక రైతు రూ.2 లక్షల లోన్ తీసుకుంటే.. రూ.20 వేలు సొసైటీ కట్ చేసుకొని రూ.1.80 లక్షలు మాత్రమే రైతుకు ఇస్తారు. కానీ, వడ్డీ రూ. 2 లక్షలకు వేస్తారు. ఇలా ఒక్కో రైతుపై కట్ చేసుకున్న మొత్తం కోట్లలో ఉంటుంది. అయితే, ఆ డబ్బులు ఏం చేస్తున్నారు. దానిపై వచ్చిన లాభం ఎంత, దాని గుడ్‌విల్ ఎంత.. ఈ లెక్కలేవీ చెప్పడం లేదు. ఆ వివరాలన్నీ బయటికి తీస్తే సొసైటీల్లో రూ. కోట్లలో అవినీతి బయట పడే అవకాశాలు ఉన్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. కాంగ్రెస్ సర్కారు గడిచిన నాలుగు విడుతలుగా చేస్తున్న రుణమాఫీలో కొన్ని సొసైటీల్లో రైతులకు తెలియకుండా వారి పేర్లపై లోన్‌లు తీసిన ఘటనలు వెలుగులోకి వచ్చాయి. అందుకే సహకార సంఘాల్లో లోన్ తీసుకున్న రైతులకు అసలు రుణమాఫీ కావడం లేదని అన్నదాతలు ఆరోపిస్తున్నారు. ఒకే రేషన్ కార్డు ఉందని, ఇంట్లో ఒక్కరికేనని, ఐటీ కడుతున్నారని ఇప్పటికే చాలా మంది రైతులను రుణమాఫీ నుంచి తప్పించిన అధికారులు కనీసం రూ.2 లక్షల లోపు రుణం ఉండి అర్హులైన వారికైనా మాఫీ చేయాలని అన్నదాతలు డిమాండ్ చేస్తున్నారు. అన్ని జిల్లాల సొసైటీల్లో అక్రమాలపై దర్యాప్తు చేసి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని, నష్టపోయిన రైతులకు ఇప్పటికైనా న్యాయం చేయాలని విజ్ఞప్తులు వెల్లువెత్తుతున్నాయి. మరి ఇప్పటికైనా అధికారులు ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకొని సహకార సంఘాల్లో రుణమాఫీ కాని రైతులకు న్యాయం చేస్తారో లేదో చూడాలి మరి.




హాజీపూర్ మండలంలోని పద్దనపల్లి సొసైటీ

*మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం పద్దనపల్లి పీఏసీఎస్‌లో మొత్తం 1972 మంది రైతులుండగా, ఇందులో 417 మంది రుణాలు తీసుకున్నారు. వీరిలో 276 మంది అర్హులు కాగా, సొసైటీ మొత్తంగా ఒకే ఒక్కరికే రుణమాఫీ జరిగింది. ఈ సొసైటీలో రూ. 2 లక్షలలోపు తీసుకున్న రుణ మొత్తం రూ.1.80 కోట్లు ఉండగా, కేవలం రూ.50 వేలే అయ్యింది.*



గంగిరెద్దుల విన్యాసాలు(ఫైల్)

# సంబురాల సంక్రాంతికి వేళాయె

*సంబురాల సంక్రాంతి వచ్చేసింది.* పట్టణాల్లో ఉన్న వారంతా సొంతూళ్లకు చేరుకోగా, ప్రతి ఇల్లూ కళకళలాడుతున్నది. ముగ్గులతో ముస్తాబైన వాకిళ్లు కనువిందు చేస్తుండగా, గంగిరెద్దుల విన్యాసాలు.. పిల్లల ఆటా పాటలతో ఎటు చూసినా సందడి కనిపిస్తున్నది. సోమవారం భోగిని వైభవంగా నిర్వహించిన ప్రజానీకం నేడు సంక్రాంతి, రేపు కనుమను ఘనంగా జరుపుకునేందుకు సిద్ధమైంది.

- నమస్తే బృందం
























ర్యాలీలో గాలిపటాలు, ప్లకార్డులు ప్రదర్శిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న, బీఆర్ఎస్ నాయకులు, రైతులు



ఆందోళన చేస్తున్న మాజీ మంత్రి జోగు రామన్నను తీసుకెళ్తున్న పోలీసులు

# మోసకారి కాంగ్రెస్

## ఆరు గ్యారెంటీలు, 420 హామీలను అమలు చేయాల్సిందే..

- తులం బంగారం, రుణమాఫీ, రైతుభరోసాలను నెరవేర్చాల్సిందే..
- కేసులకు భయపడేది లేదు..
- మాజీ మంత్రి జోగు రామన్న
- విశ్రాంతి భవనం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ
- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాస్తారోకో
- రోడ్డుపై బైఠాయించిన నాయకులు, రైతులు
- వినూత్నంగా గాలిపటాలతో నిరసన

ఆదిలాబాద్, జనవరి 13(నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలు, 420 హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా రైతులను మోసం చేస్తున్నదని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతు భరోసా కింద రూ.15 వేలు ఇవ్వాలని, రూ. 2 లక్షల రుణమాఫీ, తులం బంగారంతోపాటు ఇతర హామీలు నెరవేర్చాలంటూ ఆందోళన చేపట్టారు. విశ్రాంతి భవనం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు బస్టాండ్ సమీపంలో ప్రధాన రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గాలిపటాలతో వినూత్నంగా నిరసన చేపట్టారు. కాంగ్రెస్ పాలనలో రైతుల జీవితాలు తెగిన గాలిపటాలుగా మారాయంటూ పతంగులను ప్రదర్శించారు. రామన్న మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో రైతు భరోసా కింద ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని ప్రకటించిన కాంగ్రెస్, ఇప్పుడు ఎకరాకు రూ.12 వేలు ఇస్తామని రైతులను మోసం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నాయకులపై ప్రభుత్వం కేసులు బనాయిస్తున్నదని, కేసులకు భయపడేది లేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్ రైతుల సమస్యలపై మాట మాట్లాడడం లేదని, గతంలో ముఖ్యమంత్రి కార్యాలయం ముందు ఆందోళన చేసిన ఆయన ఇప్పుడు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బానిసగా వ్యవహిస్తున్నాడని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో రైతులకు జరుగుతున్న అన్యాయంపై కళాకారులు నిర్వహించిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

### ఆందోళన ఉద్రిక్తం

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న ఆధ్వర్యంలో బస్టాండ్ వద్ద నిర్వహించిన ఆందోళన ఉద్రిక్తంగా మారింది. రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకున్నది. మాజీ మంత్రి జోగు రామన్నతోపాటు ఇతర నాయకులను అక్కడి నుంచి తీసుకెళ్తుండగా నాయకులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు యూనిస్ అక్బానీ, విజ్జిగిరి నారాయణ, సాజిదొద్దీన్, గండ్రత్ రమేశ్, సెవ్వా జగదీశ్, రాజన్న, పరమేశ్వర్, కుమ్ర రాజు, ఆస్కం గంగయ్య, అడప తిరుపతి, సతీశ్, కస్తాల ప్రేమల, స్వరూపరాణి, మమత, పర్వీన్, కరుణ, అశోక్ స్వామి, పనన్ నాయక్, కొండా గణేశ్, ధమ్మపాల్, వసంత్, విఠల్, చెన్నై సాయి, ప్రశాంత్ పాల్గొన్నారు.



పతంగి ప్లకార్డుతో జోగు రామన్న

# ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

తలమడుగు, జనవరి 13 : ఆధ్యాత్మికమార్గంతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం పల్సి తండాలోని సంత్ శ్రీ నారాయణ బాబా ఆశ్రమంలో జరిగిన ఆలయ 29వ వార్షికోత్సవం(అఖండ హరినామ మహా యజ్ఞోత్సవానికి) ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై పూజలు చేశారు. అనంతరం ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు కిషన్ మహారాజ్‌ను ఎమ్మెల్యే సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ వెంకటేశ్, నాయకులు ముడుపు కేదారేశ్వరరెడ్డి, అభిరామ్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, రవికాంత్, అసం రవి, నాగిరెడ్డి, నర్సింలు, వామన్, శ్రీనివాస్, చందు, రంజిత్‌రెడ్డి, పెందుర్ మాధవ్ పాల్గొన్నారు.




మాట్లాడుతున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

## అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం

ఎదులాపురం, జనవరి 13 : ఆదిలాబాద్ పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన బోంపల్లి నరేందర్(30) ఈ నెల 10న అదృశ్యం అయ్యాడు. సోమవారం ఆయన మృతదేహం లభించినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 9న ఇంటి నుంచి బయల్దేరిన నరేందర్ ఆదిలాబాద్ పట్టణంలోని తాంసి బస్టాండ్ ప్రాంతంలో తండ్రికి కనిపించాడు. మరుసటి రోజు నుంచి కనిపించకుండా పోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, బంధువుల ఇంటి వద్ద గాలించారు. ఆయన ఆచూకీ లభించకపోవడంతో ఈ నెల 10న అదృశ్యమైనట్లు టూటౌన్‌లో ఫిర్యాదు చేశారు. జైనథ్ మండలంలోని పెన్‌గంగాలో శవమై తేలినట్లు వివరించారు. జైనథ్ పోలీసులు సమాచారం అందించడంతో కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

## హైమాస్ట్ లైట్లు ప్రారంభం

బోథ్, జనవరి 13 : నాగూడ, ఘన్‌పూర్‌లోని ఎస్సీ కాలనీలో గ్రామస్తులు హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కు విద్యుద్దీపాలు ఏర్పాటు చేయాలని విన్నవించగా రెండు చోట్ల ఏర్పాటుకు నిధులు విడుదల చేశారు. వాటిని గ్రామస్తులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు.